క్లుప్తంగా

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని కాలనీలలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



సుదర్శన్ దంపతులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

వనస్థలిపురం: వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు కొనియాడదగినవని వనస్థలిపురం ఆదిత్య ఐఐటీ కాన్సెప్ట్ పాఠశాల చైర్మన్ డా.సుధాకర్ అన్నారు. వాసవి వనిత ప్రశాంత్‌నగర్ క్లబ్ ఆధ్వర్యంలో సుదర్శన్ దంపతులు ఆదిత్య కాన్సెప్ట్ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థుల చదువుకోసం రూ. 1,20,000 పాఠశాల యాజమాన్యానికి విరాళంగా అందజేశారు. అలాగే పేద విద్యార్థులకు రూ. 21 వేలు విలువచేసే అకాడమిక్, ప్రైవేటు పుస్తకాల కిట్‌లను వారు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ సరిత పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని చింతలకుంట కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా రాజశ్యామల యాగం



యాగంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ, తీగల అనితారెడ్డి తదితరులు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామం కోరుపోలు చంద్రారెడ్డి రిసార్ట్స్‌లో కాంగ్రెస్ నాయకులు కోరుపోలు రాకేశ్‌రెడ్డి –శైలజారెడ్డి దంపతులు నిర్వహిస్తున్న శత చండీ సమేత రాజశ్యామల యాగం బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పూజలకు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, అనంతలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



గుంతల్లో మొరం పోసి చదును చేయిస్తున్న నాయకులు

కందుకూరు: మండల కేంద్రం నుంచి దెబ్బడగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో వాహనదారుల ఇబ్బందులను గమనించిన ఆ గ్రామానికి చెందిన బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి బుధవారం తన సొంత డబ్బుతో తాత్కాలికంగా గుంతల్లో మొరం పోయించి ట్రాక్టర్ డోజర్‌తో చదును చేయించాడు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు బ్రేక్



బాలాపూర్-ఆర్‌సీఐ మార్గం

- వర్షం కారణంగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలని డిమాండ్

బడంగ్‌పేట్: ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. పలు చోట్ల ఛిద్రమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అధికారులు పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండగానే వర్షాలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

రాకపోకలకు ఇబ్బందులు

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించారు. గ్రీన్‌హోమ్స్ కాలనీ నుంచి నాదర్‌గుల్ వరకు రోడ్డు నిర్మాణానికి గాను కంకర పరిచారు. అనంతరం వర్షాల రాకతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. బడంగ్‌పేట-బాలాపూర్ ఆర్‌సీఐ రహదారి సైతం గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జేసీబీలతో రోడ్డును చదును చేసి కంకర పరిచారు. పక్షం రోజులుగా పనులు ఆగిపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కాగా ఇప్పటికే మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులతో సమావేశమై రోడ్డు పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. అయినప్పటికీ వారిలో నిర్లక్ష్యం వీడలేదంటూ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను వేగిరం చేయాలని కోరుతున్నారు.

రెండు రోజుల్లో ప్రారంభం



పదిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో పనులు నిలిపివేశాం. రెండు రోజుల్లో పనులు మొదలు పెడతాం. వర్షంలో రోడ్డు వేస్తే కొట్టుకుపోతుంది. కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నాం. పనుల్లో వేగిరం పెంచి ఇబ్బందులు తీరుస్తాం.

– పి.సరస్వతి, కమిషనర్

పనుల్లో వేగం పెంచాలి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మాడ్గుల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో మాడ్గుల రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం నుంచి మాడ్గుల రోడ్డులో సందబావి వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చాలా ఇళ్ల ముందు భాగంలో కూల్చివేశారు. ప్రస్తుతం సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దుర్గయ్య, మెకానిక్ బాబా, రవీందర్, విజయ్‌రాథోడ్, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి మాజీ సర్పంచ్ సత్యం, స్థానిక నాయకులు వెంకటయ్య, సాయిలుగౌడ్, రాకేశ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికే పథకాలు

మాడ్గుల: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, సొంతిళ్లు ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కొక్కటిగా హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్ రెడ్డి, నాయకులు కొండల్ రెడ్డి, పాండు గౌడ్, జగన్, రాములు, జంగయ్య, యాదయ్య, సాయిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, దళపతి గౌడ్, బాబా, సలీం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండా పంచాయతీ పరిధిలోని పోచమ్మ గడ్డతండాకు చెందిన జర్పుల ప్రియాంకకు సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి రూ. 27 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్పతినాయక్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

ఎల్‌బీనగర్: కాలనీ అభివృద్ధే తన ధ్యేయం అని, కాలనీలో మౌళిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీలో ఓపెన్ జిమ్ మంజూరు, పార్కు ఏర్పాటు, సాయిబాబా గుడి నుంచి శివాలయం వరక సీసీ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి, చేసిన సందర్భంగా కాలనీ అధ్యక్షులు పోగుల రాంబాబు అధ్వర్యంలో బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి,అనిల్‌కుమార్‌చౌదరి, లక్కరాజు ప్రశాంత్ ముద్దగౌని సుమన్‌గౌడ్,సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం

ప్రతి కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీలో కమ్యూనిటీహాల్ బుధవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్స్‌ను ఏర్పాటు చేయడంతో కాలనీ సమస్యలను చర్చించుకునే అవకాశం ఉందని దీంతో కాలనీలో అభివృద్ధి పనులను శరవేగంగా చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జలందర్‌రెడ్డి, నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్ అనిల్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీజేపీ గిరిజన మోర్చా షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ గిరిజన మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ, చింతగూడ గ్రామాల్లో పార్టీ నూతన బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తద్వారా పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా తోట సాయికుమార్, కార్యదర్శిగా శివ, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా సాయికుమార్, చింతగూడ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, మన్‌కీబాత్ ప్రముఖ్‌గా కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు నాయకులు నూతన సభ్యులకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, చేగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య

కడ్తాల్: డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానానికి అర్హులేనని హైకోర్టు తీర్పునివ్వడం చారిత్రాత్మకమని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2004 సెప్టెంబర్ 01 ముందే ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చిందని, పాత పెన్షన్ విధానానికి అర్హులమని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. సీపీఎస్‌కు మందే నోటిఫికేషన్ వచ్చిందని టీఎస్ యూటీఎఫ్ సంఘం అనేక రకాల పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. 2003 ఉపాధ్యాయులకే కాకుండా, మొత్తం 2004 సెప్టెంబర్ 01 ఉపాధ్యాయులుగా నియామకమయ్యారో వారికి సైతం ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

మహేశ్వరం: మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నామన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి మరింత శక్తి సామర్థ్యాలు అందించాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందాలని వేడుకున్నారు. అంతకుముందు ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం, అభిషేకం, హారతి, కుంకుమార్చన, పుష్పలంకరణ నిర్వహించారు. ఆలయ పూజారులు కేఎల్లార్‌ను ఘనంగా సన్మానించి ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, ఆలయ చైర్మన్ అల్లె కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సినారె జీవితం ఆదర్శం

హయత్‌నగర్: డాక్టర్ సి.నారాయణరెడ్డి వ్యక్తిత్వం మహోన్నత హిమగిరి శిఖరమని.. ఆయనలోని నిరంతర పఠనాభిలాష విద్యార్థులకు ఆదర్శప్రాయమని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు అన్నారు. సినారె జయంతిని సందర్భంగా తెలుగు విభాగం అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో బుధవారం సినారె జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎంతో మంది సమ కాలీన కవులను ప్రభావితం చేసిన నారాయణరెడ్డి తెలుగు సాహిత్యంలో ఉన్నత స్థాయికి ఎదిగారని.. ఆయన కలం నుంచి జాలువారిన పాటలు ఎన్నో ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇందిర, అధ్యాపకులు వెంకటలక్ష్మి, శశిధర్, మల్లేశ్, యాదయ్య, రమాదేవి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లుపై తిరగబడాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బీసీ బిల్లుపై బీసీ వర్గాలు తిరగబడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. బడంగ్‌పేట్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీల బిల్లు పేరుతో ముస్లింలకు మేలు చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీలకు 34 శాతం ఉండేవన్నారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి విధానాలతో 10 శాతం రిజర్వేషన్ ముస్లింలకు ఇవ్వబోతుందన్నారు. బీసీల పేరుతో ముస్లింలు రాజకీయంగా లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. బీసీ సంఘాలు దీన్ని గుర్తించాలన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఈ దేశానికి ప్రధానిగా ఉన్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడు బీసీలను పట్టించుకోలేదని ఆరోపించాడు. బీసీ రిజర్వేషన్లు తీసుకొస్తున్నాం అని కాంగ్రెస్ ప్రభుత్వం ముసలి కన్నీరు కారుస్తూ బీజేపీపై బట్టకాల్చి మీద వేద్దామని చూస్తున్నారని, అది మాత్రం జరగబోదన్నారు. బీసీ సామాజిక వర్గాలను తప్పుదారి పట్టించేందుకు కాంగ్రెస్ చూస్తోందన్నారు. ఇది కేవలం బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేస్తున్న కుట్ర అన్నారు. ఓబీసీ వర్గాలు అర్థం చేసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రయత్నాల్లో భాగమే బీసీ బిల్లు అన్ని పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వొద్దని ఈ సందర్భంగా కోరారు.

సీసీరోడ్డు నిర్మాణంపై హర్షం



సీసీరోడ్డును పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు

కందుకూరు: తమ గ్రామానికి ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని బాచుపల్లి మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ కొనియాడారు. గతంలో ఎమ్మెల్యే సూచనల మేరకు మండల పరిధిలోని బాచుపల్లి కేకే బస్తీలో సీసీరోడ్డు నిర్మాణానికి జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయి. బుధవారం ఆ నిధులతో పూర్తయిన రోడ్డును గ్రామస్తులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేకంగా నిధులు కేటాయించి సహకరించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆయన వెంట గ్రామపెద్దలు ఆరోగ్యరెడ్డి, ధన్‌రాజ్‌రెడ్డి, థామస్‌రెడ్డి, తాతిరెడ్డి మారెడ్డి, తుమ్మ ఆరోగ్యరెడ్డి, తుమ్మ ఉషమ్మ, పాతమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

మీర్‌పేట: విద్యార్థులు సోషల్ మీడియాతో పాటు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మీర్‌పేట ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మీర్‌పేట పోలీసు సిబ్బంది మహిళా అభివృద్ధి, సాధికార కేంద్రం (సీడీఈడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట జూనియర్ కళాశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోలీసులు అందిస్తున్న సేవలు, కుటుంబ న్యాయ సలహా కేంద్రం అందిస్తున్న సేవలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెట్టింగ్ యాప్స్‌తో కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు, పరిష్కార మార్గాలు, బాల్య వివాహాలు, ప్రేమలు, మోసాలు తదితర అంశాలపై విద్యార్థులకు జాగృతి కళాజాత బృందం వారు పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం కాంతారావు, ఏఎస్ఐ సుజాత, కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: అర్హులందరికి రేషన్‌కార్డులను అందజేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపాలిటీలు, మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు మంజూరైన కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలకులు పేదలను విస్మరించారని.. వారి పదేళ్ల పాలనలో ఓ ఒక్క పేదవాడికి రేషన్‌కార్డును, ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామిలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. దశల వారీగా పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్లు సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడ బృందావనం కాలనీ వాసులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూజీడీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్లు, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామ భీంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధికారి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



సర్వీస్‌రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న ఇటుకల వ్యాపారం



సర్వీస్‌రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన పార్కింగ్

సర్వీసు రోడ్డు మాయం!

- అనధికారికంగా వ్యాపార కార్యకలాపలాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

హస్తినాపురం: నాగార్జున సాగర్ జాతీయరహదారిపై హస్తినాపురం చౌరస్తా దగ్గర సర్వీస్ రోడ్డును ఆక్రమించి అనధికారికంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాగార్జునసాగర్ జాతీయ రహదారి పై హస్తినాపురం సిగ్నల్ దగ్గర పక్కన ఉన్న సర్వీస్‌రోడ్డును కబ్జాచేసి అధికారుల అండదండలతో ఒకవైపు బిల్డింగ్ మెటీరియల్ ససరఫరా వ్యాపారం చేస్తుండగా మరోవైపు సర్వీస్‌రోడ్డును ఆక్రమించుకుని లాన్‌ను ఏర్పాటు చేసి సర్వీస్‌రోడ్డు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నా ఎల్‌బీనగర్ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌బీనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారుల అండదండలతో బహిరంగంగా సర్వీస్‌రోడ్డును కబ్జాచేసి సర్వీస్ రోడ్డు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని దీంతో ప్రతి నిత్యం వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులుపడుతున్నారని దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతోందని అయినా ఈ సమస్య గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ లోని చాలా ప్రాంతాలలోని ప్రధాన రహదారులపై ఒక వైపు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తుండగా మరోవైపు అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడతున్నారని ఎలాంటి అనుమతులు లేకుండా నాగార్జున సాగర్‌రహదారిపై బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ఆయాప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

జీహెచ్ఎంసీకి లేఖ రాశాం



నాగార్జున సాగర్ రహదారిపై హస్తినాపురం సిగ్నల్‌దగ్గర సర్వీస్ రోడ్డును ఆక్రమించి బిల్డింగ్ మెటీరియల్ సప్లై వ్యాపారం చేస్తున్నారని, సర్వీస్ రోడ్డు ఆనవాల్లు లేకుండా సర్వీస్‌రోడ్డుపై లాన్‌లు ఏర్పాటు చేసిన విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాశాము. సర్వీస్‌రోడ్ల ఆక్రమణలను తొలగించాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే .మేము వారికి సహకరించి ఆక్రమణలను తొలగిస్తాం. ఆక్రమణలతో హస్తినాపురం సిగ్నల్ దగ్గర ట్రాఫిక్ సమస్య ఉన్న మాట వాస్తవమేనని జీహెచ్ఎంసీ అధికారుల కోఆర్డినేషన్‌తో సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాము.

– భూపతి గట్టుమల్లు, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్